# కమల్ హాసన్‌కి గాయాలు!

శివాజీ ఫిలింస్ 'ఇంద్రజిత్' షూటింగ్ మద్రాసులోని పూనమల్లి హైరోడ్‌లో జరుగుతుంది. పోలీస్ వ్యాన్, రౌడీలు వున్న జీప్ కమల్‌హాసన్‌ని తరుముతుంటే వాళ్లను తప్పించుకోవడానికి ట్రాఫిక్ మధ్య నుంచి పరిగెట్టే సన్నివేశం చిత్రీకరిస్తున్నారు. కమల్‌హాసన్ పరిగెడుతూ అడ్డం వచ్చిన కారుల మీద నుంచి దూకుతూ – ప్రక్కనుంచి వచ్చే స్కూటర్లని, ఆటోలని తప్పించుకుంటూ పరిగెడుతున్నారు. సడన్‌గా ఒక కారు వచ్చి పరిగెడుతున్న కమల్‌హాసన్‌ని గుద్దడంతో ఎగిరి అవతలపడ్డాడు. కుడికాలికి తీవ్రమైన గాయం తగిలి రక్తం రావడంతో వెంటనే ప్రొడక్షన్ వ్యక్తులు కమల్‌హాసన్‌ని అపోలో హాస్పటల్లో జాయిన్ చేశారు. డా. ఆర్.గోపాలకృష్ణ, డా. ఉమాచంద్ర కమల్‌హాసన్ గాయాలకు చికిత్స చేసి పెద్ద ప్రమాదం లేదని చెప్పారు.

ఈ విషయం తెలియగానే కమల్‌హాసన్ భార్య సారిక వెంటనే హాస్పటల్‌కి వచ్చారు. శివాజీగణేశన్, ప్రభు తదితర ప్రముఖులు హాస్పటల్‌కి వెళ్లి కమల్‌హాసన్‌ని పరామర్శించారు.

– మానస



## పొదుపు

పొదుపు అనేది ఏమిటో మనలో చాలామందికి తెలీదు. మీనాక్షి శేషాద్రికి మనకంటె బాగా తెలిసినట్లు కనిపిస్తుంది. పత్రికలు ఆమె కొనదట. లెండింగ్ లైబ్రరీ నుంచి తెప్పించుకుని చదువుతుంది. ఈ సందర్భంగా ఆమె ఇలా అంటున్నది – "మీరు రూ. 2/–కి దొరికే వస్తువు కోసం రూ. 20/– ఖర్చు చేయాల్సిన అవసరం ఏముంది?" మీనాక్షి శేషాద్రి పొదుపు ఇంత దూరం ఎదిగిపోయినదంటే అందుకు కారణం రాజ్‌కుమార్ సంతోషీ అయివుండాలని కొందరి వాదన. ఈ పొదుపు ఈమెని హీరోయిన్‌గా తీసుకుని సినిమా తీసే నిర్మాతలు కూడా చూపిస్తే అప్పుడు 'మిస్‌కోల్డ్ మీ.శే.' రియాక్షన్ ఎలా వుంటుందో మరి!



బి.ఆర్. సుంకర



## గెలుపు

శరత్‌కి చాలా గర్వం. అందరితో రకరకాల పందాలు కడతాడు. అన్నిట్లోనూ వాడే గెలుస్తాడు–అదీ వాడి గర్వానికి కారణం. ఎన్నిసార్లో నేను వాడి చేతిలో ఓడిపోయాను. అయినా ఒక్క సారైనా గెలిచి వాడ్ని దెబ్బ తీయాలన్న నా కోరిక రోజు రోజుకి ఎక్కువైంది.



రోడ్డు మీద వెడుతున్న అమ్మాయి జడలో పువ్వు పెట్టి దెబ్బలు తినకుండా రావాలి. వంద రూపాయిలు పందెం అన్నాడు శరత్. "నాకు భయం" అన్నాను. "నువ్వు వట్టి పిరికి సన్నాసివి" అన్నాడు శరత్. నాకు పౌరుషం వచ్చి రేపు సాయంత్రం పందెం వేసుకుందాం సరేనా అన్నాను.

ఆ రోజు మా చెల్లెలి స్నేహితురాలు రమకి పందెం విషయం చెప్పి, బ్రతిమాలగా చివరికి ఎలాగో ఒప్పకొంది. ఆ రోజు సాయంత్రం శరత్‌కి అనుమానం రాకుండా ప్లాన్ చేసుకుని రమ జడలో పువ్వు పెట్టాను. గర్వంగా శరత్ నుండి పందెం డబ్బు వంద రూపాయలు తీసుకున్నాను. కాని ఆ గర్వం ఎంతో సేపు వుండలేదు.

"ఇదిగో పందెం డబ్బు రెండు వందలు. నీ ఫ్రెండ్ అమ్మాయి జడలో రోడ్డు మీద వెళ్తూ పువ్వు పెట్టలేడని పందెం కాసి నేను ఓడిపోయాను" అంటూ చైతన్య వచ్చి శరత్ చేతిలో డబ్బు పెట్టడం చేసే సరికి....

పాణంగిపల్లి నాగభూషణం